క్లుప్తంగా

క్రాప్‌లోన్ల మంజూరుకు చర్యలు

కూడేరు: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్‌లో కొత్తగా క్రాప్‌లోన్లు (పంట రుణాలు) మంజూరు చేస్తున్నట్లు ఫీల్డ్ ఆఫీసర్ గోపీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మేరకు ఎకరాకు రూ..45 వేల చొప్పున రుణం అందజేస్తామని పేర్కొన్నారు. క్రాప్‌లోన్ కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు, ఫొటోలు, లేటెస్టు కంప్యూటర్ అడంగల్, 1బీ తీసుకురావాలన్నారు. జామీనుదారు (ష్యూరిటీదారుడు) అవసరం లేదన్నారు.

తక్కువ వడ్డీకే బంగారంపై రుణాలు

కూడేరు: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టుకుని రుణం ఇస్తామని మేనేజర్ రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూమి పట్టాదారుపాసు పుస్తకం ఆధారంగా తులానికి రూ.60 వేలు ఇస్తామన్నారు. బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్ చేసుకుంటే సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల్లోపు సీనియర్ సిటిజన్లకు 8.10 శాతం వడ్డీ, జనరల్ సిటిజన్లకు 7.60 శాతం వడ్డీ ఇస్తామని పేర్కొన్నారు. డిపాజిట్లపై నెల, మూడు నెలలకు మెచ్యూరిటీ వడ్డీ ఇచ్చే వెసలుబాటు ఉందని తెలిపారు.

యోగాతో ఆనందం, ఆరోగ్యం



ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన యోగా శిక్షణలో పాల్గొన్న యువకులు

రాయదుర్గంటౌన్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం, ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీఓ కొండన్న పేర్కొన్నారు. క్రమం తప్పకుండా రోజూ యోగాసానాలు చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. సోలో యోగా, మెడిటేషన్, ప్రాణాయామం, సూర్య నమస్కారంకు సంబంధించి మహిళలు, పురుషులకు పోటీ పరీక్షలు జరిపి ఒక్కో యాక్టివిటీకి సంబంధించి ముగ్గురు చొప్పున శిక్షకులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంటౌన్: విద్యా హక్కు చట్టాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అధిక ఫీజులు కట్టించుకుని అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు చెప్పారు.

యువకుడికి తీవ్రగాయాలు

కూడేరు: మండల పరిధిలోని జల్లిపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పేరూరుకు చెందిన సంజయ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మరో యువకుడు గంగశివ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సంజయ్, గంగశివ ఇద్దరు స్నేహితుడి ద్విచక్ర వాహనాన్ని తీసుకుని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి బయలుదేరారు. జల్లిపల్లి వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డు రాయిని ఢీకొంది. ఈ ఘటనలో సంజయ్ తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను టోల్‌గేట్ 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



సీఐ జయనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రాయదుర్గంటౌన్: గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని వీహెచ్‌పీ రాయదుర్గం శాఖ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు రాజేష్ తదితరులు చట్టవ్యతిరేకంగా గోవులను తరలించడం, బహిరంగ ప్రదేశాల్లో పశువులను వధించడం లాంటి వాటిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని అర్బన్ సీఐ జయానాయక్, రూరల్ సీఐ వేంకటరమణలకు వినతిపత్రం అందజేశారు. గోమాతగా పిలువబడే గోవులను వధించడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమైంది. అన్ని ప్రాంతాల్లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిరసనలతో హోరెత్తించారు.

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 'వెన్నుపోటు దినం' సక్సెస్
- నిరసనలతో హోరెత్తించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- కూటమి ఏడాది పాలనపై నేతల మండిపాటు



ఉరవకొండ: ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, పార్టీ శ్రేణులు



కళ్యాణదుర్గం: పట్టణంలో ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

ఉరవకొండ: సూపర్ సిక్స్‌తో సహా 143 హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను నట్టేట ముంచారని నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం ఉరవకొండలో వెన్నుపోట దినం నిర్వహించారు. స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం నుంచి వేలాది మందితో ర్యాలీని ప్రారంభించారు. క్లాక్‌టవర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ కొనసాగింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఒక్క హామీ అమలు చేయకుండా అప్పులు చేయడంలో చంద్రబాబు రికార్డు సృష్టించారన్నారు. ఏడాదిలోనే రికార్డు స్థాయిలో రూ.1.51 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. ఉరవకొండలో వైఎస్సార్ పాలనలో ఒక్క రోడ్డు, డ్రైనేజీ కుడా నిర్మించలేదని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లలో ఒక్క ఉరవకొండ నియోజకవర్గంలోనే రూ.2,500 కోట్లతో సంక్షేమ పథకాలు, వెయ్యి కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కరోనా వచ్చినా సంక్షేమ పథకాలు ఎక్కడా నిలపకుండా ప్రజలకు బొటన్ నొక్కి నగదు అందించారని గుర్తు చేశారు. ఆర్థిక మంత్రి కేశవ్ ఆయన సోదరుడు శీనప్ప పోలీసులకు అధికారులను అప్పగించి వారి చేత పాలన చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులను స్టేషన్‌కు పిలిపించి టీడీపీలో చేరితే మీపై కేసులు ఉండవని బెదిరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, ప్రధాన కార్యదర్శి అశోక్, ఎంపీపీలు రమావత్ దేవిబాయి, కరణం పుష్పావతి, నరసింహులు, నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, జెడ్పీటీసీలు ఏసీ పార్వతమ్మ, త్రిలోక్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచులు మీనుగ లలితమ్మ, మోనాలీసా, ఐదు మండలాల కన్వీనర్లు ఓబన్న, ఎర్రిస్వామి రెడ్డి, బైరెడ్డి రామచంద్రారెడ్డి, కురుబ రమేష్, మచ్చన్న, సోమశేఖర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు కరణం భీమిరెడ్డి, బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, శివలింగప్ప, జల్లిపల్లి దేవేంద్ర, లత్తవరం గోవిందు, విడపనకల్లు సుంకన్న, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గోవింద నాయక్, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, మైనార్టీ నాయకులు అసిఫ్, ఉస్మాన్, జిలాన్, మైనుద్దీన్, బెళగల్ షమ్ము, వడ్ల హాజీ షేక్షావలి, చేనేత విభాగం నేతలు ఎంసీ నాగభూషణం, నిమ్మల వెంకటరమణ, సాధుకుళ్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలి

- కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: సొంత మామకే వెన్నుపోటు పొడిచిన సీఎం చంద్రబాబు వంటి వ్యక్తికి నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు వెన్నుపోటు పొడవడం పెద్ద లేక్క కాదని ఇలాంటి వ్యక్తికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య విమర్శించారు. బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆర్డీటీ ఆసుపత్రి నుంచి తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో నినాదాలతో ఆర్‌డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఈశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే తాను ఎక్కువ సంక్షేమ పథాకలను ప్రజలకు అందిస్తానని అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సాధ్యంకాని హామీలు ఇవ్వడంలో బాబును మించిన వారు లేరన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల రాష్ట్ర కార్యదర్శులు నారాయపురం వెంకటేశులు, రామాంజినేయులు, తిమ్మరాయుడు, నరేంద్రరెడ్డి, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న, డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మన్న, పట్టణ కన్వీనర్ సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు హనుమంతురాయుడు, గోళ్ల సూరి, కంభం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎస్ రాయుడు, హనుమంతురాయుడు, వెకంటప్ప, వివిధ విభాగాల అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు సుదర్శన్ రెడ్డి, నీలి శంకరప్ప, కృష్ణమూర్తి, కృష్ణరెడ్డి, కిరిటీ, తిప్పేస్వామి, మల్లికార్జున, బిక్కిహరి, షేక్షావలి, సత్తి, దాదు, ఫయాజ్, కిరణ్, తిప్పేస్వామి, పాలక్షి, చందన శివాజి, ప్రియాక, నాగలక్ష్మి, కౌన్సిలర్లు పరమేశ్వరప్ప, లక్షన్న, నాయకులు రామిరెడ్డి, అఫ్జల్, రామ్మూర్తి, భీమప్ప, మురళీ, రాజగోపాల్, తిప్పేస్వామి, గోపాల్, న్యాయవాదులు హనుమంతురెడ్డి, దాదాఖలందర్, రామాంజినేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు నయవంచకుడు



రాయదుర్గం: ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

రాయదుర్గం: చంద్రబాబు లాంటి నయవంచకుడ్ని దేశంలోనే ఎక్కడ చూడలేదని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్కహామీ కూడా అమలు చేయకుండా వంచించాడని ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వినాయక సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మెట్టు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడారు. మోసం, దగా, వెన్నుపోటు లాంటి కుట్రలు చంద్రబాబుకు వెన్నుతో పెట్టిన విద్యన్నారు. ఓట్లేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడని మండిపడ్డారు. చంద్రబాబు అరచకపాలనకు పవన్‌కళ్యాణ్ వంతుపాడుతున్నాడన్నారు. బీహార్ కంటే ఎక్కువగా రాష్ట్రంలో అరచాకాలు, దౌర్జన్యాలు, దాడులు మితిమీరి పోతున్నా పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ప్రశ్నిస్తే చాలు కేసులునమోదు చేస్తున్నారు. ఇలా చేస్తూ పోతే ఊరికో జైలు కట్టాల్సి వస్తోందనే విషయం గుర్తించుకోవాలన్నారు. హంద్రీనీవా పథకం జిల్లాకు జీవనాడిగా మారిందంటే అది కేవలం దివంగత నేత వైఎస్సార్ చలువేనని గుర్తు చేశారు. పైపై పూతలు పూసి ఏదో సాధించినట్లు టీడీపీ నాయకులు చక్కలు గుద్దుకోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఎంపీపీ భవాని, పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని కాంతారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామాంజినేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, రామాంజియాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషారాణి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివ, ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు గోవిందు, బోజరాజ్‌నాయక్, ఎస్సీసెల్ తాలూక అధ్యక్షుడు రామాంజినేయులు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు కేశవరెడ్డి, బోర్‌వెల్ ఆనందరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కుందుర్పి: ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు బుధవారం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గొంచితండాకు తరలివెళ్లారు. ఎంపీపీ కమలమ్మ, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, భీమప్ప, కెంచంపల్లి పాలాక్షి, నాగలక్ష్మి, నరేష్ ,సర్పంచులు అతావుల్లా, మంజునాథ్, రామ్మూర్తి, వన్నూర్‌రెడ్డి, జగన్, తిప్పేస్వామి, గోపాల్, మర్రిస్వామి తదితరులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు.

శెట్టూరు: ఆర్డీటీ సంస్థ పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు బుధవారం మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గొంచితండాకు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి, కన్వీనర్ ఎమ్మెఎస్ రాయుడు. వైస్ ఎంపీపీ ముత్యాలు,పార్టీ అనుబంధ సంఘాల నేతలు హరినాథరెడ్డి, బోయ తిప్పేస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మిద్దె సుధాకర్, ఖాసీం, ప్రతాప్, ప్రకాష్, సర్పంచ్‌లు ఈరన్న, వెంకటేశులు, గొర్ల గంగాధర, ప్రకాష్, ఎంపీటీసీ ప్రహ్లాద, నాయకులు టైలర్ వన్నూరుస్వామి, శీన, గోవిందు, శివ, హనుమంతరాయుడు, హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్‌తో రోగుల ఇబ్బందులు



జనరేటర్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

రాయదుర్గంటౌన్: ఇటీవల ఏరియా ప్రభుత్వాస్పత్రిలో హెచ్‌టీ కేబుల్ కాలిపోయి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ప్యానల్ బోర్డును మరమ్మతు చేయించి జనరేటర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం అనంతపురం నుంచి విచ్చేసిన ఏఈ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్యానల్ బోర్డు బిగించి ఆస్పత్రికి జనరేటర్ వసతి కల్పించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి పనులు చేపడుతున్నారు. రాత్రి 8 గంటల దాకా మరమ్మతు పనులు కొనసాగించడంతో రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అంగడి పెట్టెలో చోరీ

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలలోని అంగడి పెట్టెలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. అదే గ్రామానికి చెందిన ఈరక్క అనే మహిళ చిన్నపాటి బంక్‌లో కిరాణా సరుకులు, తినుబండారాలు విక్రయించేది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అంగడి పెట్టెకు వెనుకవైపు కన్నం పెట్టి లోపల ప్రవేశించారు. బంక్‌లో ఎప్పటి నుంచో దాచుకున్న రూ.70 వేలు నగదు, సిగరేట్ ప్యాక్‌లు, ఇతర విలువైన సరుకులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నత్తనడకన వేరుశనగ రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ చేయించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల సర్వర్ పని చేయక మరికొన్ని చోట్ల డివైజ్‌లు పని చేయకపోవడంతో పడిగాపులు కాచారు. మండలానికి 2,100 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు, మరి కొన్ని చోట్ల అధికారులు అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్ నత్తనడకన సాగుతోంది. బుధవారం నాటికి 142 మంది రైతులు 126 క్వింటాళ్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విత్తను అదును దగ్గర పడుతోంది. ఇంకా విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని కోరుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మృతుడు ఉమేష్

కుందుర్పి: మండల సరిహద్దున ఉన్న పుర్లేపల్లి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కుందుర్పి మండలం ఎనుములదొడ్డి నివాసి కురుబ ఉమేష్(42) మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బుధవారం ఉదయం తన భార్యతో కలసి కర్ణాటకలోని చెళ్లకెరలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన ఉమేష్... మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. పుర్లేపల్లి మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వడ్డేపాళ్యం గ్రామానికి చెందిన కురాకుల కాంత, శివన్న, బొజ్జప్పగారి కాంతరాజు ఒకే ద్విచక్రవాహనంపై మద్యం మత్తులో శరవేగంగా వెళుతూ ఢీకొన్నారు. ఘటనలో ఉమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పరుశురాంపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

వై.రాంపురం వద్ద..

ఉరవకొండ రూరల్: మండలంలోని వై.రాంపురం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన శివరాం (20) మృతి చెందాడు. కొన్నేళ్ల క్రితం బతుకు తెరువు కోసం వలస వచ్చిన శివరాం అనంతపురంలోని ఓ బోర్‌వెల్ కంపెనీలో హెల్పర్‌గా పనిలో చేరాడు. ఈ క్రమంలో బుధవారం ఉరవకొండ మండలంలో బోరు బావి తవ్వేందుకు వాహనంతో పాటు వచ్చారు. వై.రాంపురం సమీపంలో ప్రయాణిస్తుండగా ఉన్నఫళంగా ఎదురుగా దూసుకు వచ్చిన గుర్తు తెలియని వాహనాన్ని బోర్‌వెల్ డ్రైవర్ గమనించి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బోర్‌వెల్ వాహనం వెనుక నిలబడి ప్రయాణిస్తున్న శివరాంతో పాటు మరో హెల్పర్ అదుపు తప్పి కిందపడ్డారు. అపస్మారక స్థితికి చేరుకున్న శివరాంను 108 అంబులెన్స్‌లో ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శివరాం మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చోరీల నియంత్రణకు కఠిన చర్యలు

- గుంతకల్లు రైల్వే డీఎస్పీ హర్షిత చంద్ర



అనంతపురం సిటీ: రైళ్లలో చోరీల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్లు రైల్వే డీఎస్పీ హర్షిత చంద్ర తెలిపారు. బుధవారం అనంతపురంలోని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రైళ్లలో జరిగిన చోరీల నేపథ్యంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్తంగా కలసి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైళ్లల్లో చోరీలకు పాల్పడినా, రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ఉపేక్షించేది లేదన్నారు. వందేభారత్ ఇతర రైళ్లపై రాళ్ల దాడులను కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. రైల్వే ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని.. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అసాంఘిక శక్తుల ఆటలు కట్టడి చేసి, రైల్వే ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చూస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రయాణ సమయాల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు.

రైలు వేళల్లో మార్పు చేయాలని వినతి

అనంతపురం సిటీ: తిరుపతి వెళ్లే ప్యాసింజర్ రైలును ఉదయం 7 గంటలకు గుంతకల్లులో మొదలయ్యేలా చూడాలని గుంతకల్లు మండలం ఇమాంపురం, అన్నంపల్లి, నాగసముద్రం, కదిరేపల్లి, అయ్యవారిపల్లి, ఓబుళాపురం, దేవరపల్లికి చెందిన విద్యార్థులు కోరారు. బుధవారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు సంబంధించిన రహదారులు అధ్వానంగా తయారై రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేవని తెలిపారు. దీంతో తాము తరగతులకు సకాలంలో హాజరయ్యే పరిస్థితులు లేవన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి రైలు వేళల్లో మార్పు చేసేలా చొరవ చూపాలని విన్నవించారు. తిరుపతి నుంచి సాయంత్రం గుంతకల్లుకు వచ్చే రైలును కూడా 4:30 గంటలకు వచ్చేలా చూడాలని సూచించారు.

లాభసాటి పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త చంద్రాయుడు

బొమ్మనహాళ్: సాగులో రైతులు లాభసాటి పద్ధతులను అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కళ్యాణదుర్గం కే.వీ.కే ప్రోగాం కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రాయుడు, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ అన్నారు. మండలంలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, దేవగిరి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో లాభసాటి పద్ధతులను అనుసరించి ఆర్థిక ప్రయోజనం కలిగించే పంటలను సాగు చేయాలన్నారు. వరి పంటసాగులో పాటించాల్సిన మెళకువలు, కొత్త వరి వంగడాలు, కాలిబాటలు, కలుపు మందుల పిచికారి, భూసార పరీక్షలు వాటి ఉపయోగాలను వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో వేరేశనగ విత్తన పంపిణీ, ఎరువుల సరఫరా, రైతు విశిష్ట సంఖ్య నమోదు వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సాయికుమార్, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి



మాట్లాడుతున్న కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో బుధవారం సీఏటీసీ-2 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శ్రీసత్య సాయి, అనంతపురం జిల్లాకు చెందిన 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్ మాట్లాడుతూ.. 10 రోజుల పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవా గుణం, డ్రిల్ ఇతర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్యాడెట్లంతా బాగా సాధన చేసి మంచి ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో అనేక ప్రయోజనాలున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ శారద, సంగీత, శశికళ, ఇంద్ర బహదూర్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.